ప్రజాశక్తి
శనివారం 12 ఆగస్టు 2023
5
కర్నూలు

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి ఛైర్మన్ పాపిరెడ్డి

గ్రామీణ రహదారులు అధ్వానం

- హౌసింగ్ అధికారులపై జడ్‌పి ఛైర్మన్ ఆగ్రహం
- జడ్‌పి స్థాయి సంఘాల సమావేశంలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశంలో జడ్‌పిటిసిలు, పలు సమస్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు సమస్యలను లేవనెత్తినా పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా పరిషత్ మినీ కాన్ఫరెన్స్ సమావేశం భవనంలో జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. రోడ్లు సరిగా లేవని ఎక్కడ చూసినా అధ్వానంగా ఉన్నాయని కోడుమూరు నుండి వెల్దుర్తి వెళ్లే రహదారి సమస్యపై ఇప్పటికి నాలుగు మీటింగులలో చెప్పానని, నేటికి సమస్య పరిష్కారం కాలేదని కోడుమూరు జడ్‌పిటిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్నూలు నుండి ఆత్మకూరు హైవే రోడ్డు పనుల్లో గార్గేయపురం దారిలో రోడ్డు పనులు నాణ్యతగా లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ఆత్మకూరు ,మిడ్తూర్ జడ్‌పిటిసిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి ఈ రోడ్డు కాంట్రాక్టర్ ఎవరు? ఎందుకు పనులు వేగవంతం చేయలేదని, ఎప్పటికి పూర్తి చేస్తారని ప్రశ్నించారు. అధికారులు పులివెందుల కాంట్రాక్టర్ అనగానే మేము చెప్తేనే మాట వినడంలేదని, ఇంకా అధికారులకు ఏమి మాట వింటారని వినపడి వినపడకుండా అంటూ మౌనం వహించారు. జిల్లాలో చాలాచోట్ల రోడ్ల పనులు పులివెందుల కాంట్రాక్టర్లు చేస్తున్నారని, కర్నూలు వారు అయింటే ఇప్పటికి నోటీసులు ఇచ్చేవారన్నారు. అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారని కోడుమూరు జడ్‌పిటిసి అధికారులను ప్రశ్నించారు. జెడ్పిటిసి సభ్యులు అడిగిన ప్రశ్నలకు హౌసింగ్ అధికారులు సమాధానం చెప్పకపోవడంతో జిల్లా పిడి హాజరు కాలేదని తమకు సమాధానం తెలీదని అసిస్టెంట్ మేనేజర్ చెప్పడంతో ఛైర్మన్ పాపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం చెప్పలేని అధికారులు ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. ఆయా మండలాల్లోని సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. అధికారులు చొరవ చూపి పరిష్కరించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైస్ ఛైర్మన్ దిల్షాద్ నాయక్, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి , ఉమ్మడి జిల్లాల జడ్‌పిటిసిలు పాల్గొన్నారు. 7వ స్థాయి సంఘానికి కాటసాని రాంభూపాల్ రెడ్డి హాజరయ్యారు.

యథేచ్ఛగా నకిలీలు

- బయో పేరుతో పురుగు మందు విక్రయం
- రూ. కోట్లల్లో సాగుతున్న దందా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నకిలీ పురుగు మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బయో పురుగు మందుల పేరుతో మార్కెట్‌లో వాటి విక్రయాలు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆ దందా కోట్లల్లో సాగుతోంది...

బయో కంపెనీల పేరుతో నకిలీ పురుగు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సదరు కంపెనీలు విక్రయదారులకు ప్రోత్సహాలు ఇస్తూ తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో దాదాపు కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో దాదాపు రూ.2కోట్లకు పైగా ఈ నకిలీ పురుగు మందుల విక్రయాలు సాగాయి. నంద్యాల జిల్లాలోనూ అదే స్థాయిలో విక్రయాలు సాగాయి. నంద్యాల జిల్లాలో దాదాపు రూ.1.5కోట్ల మేర వాటి విక్రయాలు జరిగాయి. వాస్తవానికి మల్టీ నేషనల్ కంపెనీలు 0.01 శాతం పురుగు మందుల అవశేషాలు ఉండేలా పురుగు మందుల ఉత్పత్తులను విక్రయిస్తున్నాయి. పత్తి, మిరప పంటలకు సంబంధించి మోతాదుకు మించి బయో ఫర్టిలైజర్స్‌ను రైతులు వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో లభించి పురుగు మందుల కంటే వీటి ధర తక్కువగా ఉండటంతో రైతులు బయో పురుగు మందుల వైపు మొగ్గుచూపుతున్నారు. బయో ఫర్టిలైజర్స్ నమూనాలను తీసి ప్రతి ఏటా ల్యాబ్‌కు పంపాలని వ్యవసాయ శాఖ నిబంధనలు చెబుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో బయో ఫర్టిలైజర్స్‌కు సంబంధించి కర్నూలు జిల్లాలో 15, నంద్యాల జిల్లాలో 5 నమూనాలను తీసి పంపాలని వ్యవసాయ శాఖ అధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. రాష్ట్రంలో గుంటూరు, కృష్ణా, తిరుపతి, పశ్చిమ గోదావరి, పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో మొత్తం 47 బయో పురుగు మందుల తయారీ సంస్థలు ఉన్నాయి. ఇవి 662 రకాల బయో పురుగు మందుల ఉత్పత్తులను విక్రయిస్తున్నాయి. వీటి విక్రయాలు దేశ వ్యాప్తంగా సాగుతుండగా మన రాష్ట్రంలో అధికంగా విక్రయాలు సాగిస్తున్నాయి. నీటి పారుదల ప్రాంతాల్లో ఈ బయో ఉత్పత్తుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బయో పురుగు మందులను తయారు చేసి ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణలోనూ విక్రయాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా కంపెనీల విక్రయాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఈ బయో పురుగు మందుల వ్యాపారం జిల్లాలో మండల కేంద్రాల నుంచి గ్రామాలకు కూడా చేరింది. గ్రామాల్లో అనధికారికంగా ఇళ్లలో ఈ బయో పురుగు మందుల విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో నకిలీ పురుగు మందుల విక్రయాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. నకిలీ పురుగు మందుల విక్రయాలను పర్యవేక్షించాల్సి అడ్డుకట్ట వేయాల్సిన విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద
రూ.50.45 కోట్లు జమ

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, మేయర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద 41,642 స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు బ్యాంకులకు కట్టవలసిన రూ.50.45 కోట్ల వడ్డీని పొదుపు మహిళల బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించారు. కర్నూలు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ , జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర్ మేయర్ బివై.రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, డాక్టర్ జె.సుధాకర్, ఎమ్మెల్సీ మధుసూదన్ , డిఆర్‌డిఎ పిడి నాగశివలీల తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని డిఆర్‌డిఎ మెప్మా పరిధిలో కర్నూలు జిల్లాకు సంబంధించి డిఆర్‌డిఎ (రూరల్) 29,814 స్వయం సహాయక సంఘాలకు రూ.31.91 కోట్లు, కర్నూలు జిల్లాకు సంబంధించి (మెప్మా) పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ 11,828 స్వయం సహాయక సంఘాలకు రూ.18.54 కోట్ల వడ్డీ పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద ఏ మాత్రం వడ్డీ భారం పడకుండా, ప్రభుత్వమే వారి తరఫున వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం కింద ఆ భారాన్ని భరిస్తుందన్నారు. ఎంత వడ్డీ అవుతుందో అంత మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోందన్నారు. ఇదిలా ఉండగా, వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధితో మహిళలు చిన్న వ్యాపారాలు చేయిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్, జెడ్పి ఛైర్మన్, కర్నూలు నగర మేయర్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, డిఆర్‌డిఎ పిడిలు కలసి కర్నూలు జిల్లా (రూరల్) 29,814 స్వయం సహాయక సంఘాలకు రూ.31.91 కోట్లు, కర్నూలు జిల్లా (మెప్మా) పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ 11,828 స్వయం సహాయక సంఘాలకు రూ.18.54 కోట్ల వడ్డీకి సంబంధించి చెక్కును స్వయం సహాయక మహిళలకు అందజేశారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలు : కలెక్టర్

కర్నూలు స్పోర్ట్స్ : క్రీడలతో ఉన్నతశిఖరాలకు చేరుకునే అవకావం ఉందని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. ర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఆటియా పాట్య జిల్లా స్థాయి పోటీలలో విజేతలకు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ జి.సృజన బహుమతులు ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా పాల్గొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. పోటీలలో గెలుపొందిన జట్లకు బాలురు విభాగంలో మొదటి స్థానంలో చిన్మయ విద్యాలయ హైస్కూల్, ద్వితీయ స్థానంలో వివిబి హైస్కూల్, బాలికల విభాగంలో మొదటి స్థానంలో కెజిబివి ఓర్వకల్లు పాఠశాల, ద్వితీయ స్థానాల్లో కెజిబివి పంచలింగాల పాఠశాల నిలిచాయి. ఆర్గనైజర్ సెక్రెటరీ పవన్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

డిఎస్‌సి-98 అభ్యర్థులకు న్యాయం చేయండి

- కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

1998 డిఎస్‌సి అభ్యర్థులకు న్యాయం చేయాలని 98డిఆర్‌సి అభ్యర్థులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను98 డిఎస్‌సి అభ్యర్థులు కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో రోస్టర్ విధానం పాటించకుండా 98డిఎస్‌సి అభ్యర్థులకు పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. గతంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా 98 డిఎస్‌సి అభ్యర్థులందరికీ పోస్టింగ్ ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపుగా 2000కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిలో తమకు అవకాశం కల్పించాలని విన్నవించారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో 98 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు హైమావతి, శివరాం, మల్లేష్ కుమార్, రవి ప్రకాష్, పరమేష్, తిరుమల నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ కృష్ణ కాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎస్పీ జి.కృష్ణకాంత్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ నాగరాజు గౌడ్, సహాయ కమిషనర్ వాణి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి పూలమాలలతో, శాలువాతో సన్మానించారు. అనంతరం పుణ్యక్షేత్ర పరిసరాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతతో పాటు బారికేడ్లు, సిసి ఫుటేజ్ కెమెరా ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్ సిసి ఫుటేజ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 17 నుంచి సెప్టెంబర్ 14 వరకు జరిగే శ్రావణమాస ఉత్సవాల్లో స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని తెలిపారు. భక్తులకు తాగునీరు, విద్యుత్, శానిటేషన్, పార్కింగ్, బారికేడ్లు, బస్సు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. భక్తులకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవ సమయంలో ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు అమ్మకాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అప్రమత్తంగా ఉండి ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌బి సిఐ ప్రసాద్, కోసిగి సిఐ ఎరిషావలీ, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, దేవాలయ ఛైర్మన్ నాగరాజ్ గౌడ్, సహాయ కమిషనర్ వాణి, తహశీల్దార్ రామేశ్వర రెడ్డి, దేవాలయ సూపరింటెండెంట్లు వెంకటేష్, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఉరుకుందలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, సబ్ కలెక్టర్

రాఘవేంద్రుని దర్శించుకున్న ఎస్పీ

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్రస్వామిని ఎస్పీ కృష్ణకాంత్ దర్శించుకున్నారు. శ్రీమఠం చేరుకున్న ఆయనకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆయనకు మెమొంటో అందజేశారు. ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరగనున్న రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా వాహనాల పార్కింగ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌బి సిఐ ప్రసాద్, సిఐ శ్రీనివాసులు, కోసిగి సిఐ ఏరిసావలీ, ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఉన్నారు.

ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మహాసభల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఆర్థికమంత్రి బుగ్గన

ఉద్యోగులకు అండగా ఉంటాం

ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మహాసభల గోడపత్రికను ఆవిష్కరించిన ఆర్థికమంత్రి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగులకు అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలులో ఎపిఎన్‌జిఒ రాష్ట్ర మహాసభల గోడపత్రికను ఆర్థిక మంత్రి కలిసి ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంగల్ రెడ్డి , జవహర్ లాల్, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాశన్న, పాండురంగారెడ్డి జిల్లా నాయకులు సాంబశివరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 21,22 తేదీల్లో విజయవాడలో రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు, సిఎస్, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. జిల్లా నుండి పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలిరావాలన్నారు.

సిబెళగల్‌లో కరపత్రాన్ని విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు జయరాజు , తదితరులు

పాత పెన్షన్ సాధనకు యుటిఎఫ్ కృషి

ప్రజాశక్తి-సి బెళగల్

పాత పెన్షన్ విధానం తిరిగి పునరుద్ధరణ చేయాలంటూ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయరాజు, ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎటి తిమ్మన్నలు కరపత్రాలు విడుదల చేశారు. శుక్రవారం మండల అధ్యక్షులు కిషోర్ సమక్షంలో సిబెళగల్ లో ఆయా గ్రామాలలో పాఠశాలల్లో ఉపాధ్యాయులకు, పెన్షన్ అర్హులకు పాత పెన్షన్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఇక్కడే జిఒ117ను రద్దు పరచి ప్రస్తుతం అమలు లోకి తెచ్చిన జిఓ 145లో పదోన్నతులకు తగు న్యాయం చేయాలని అన్నారు. ఇందులోనే నేడు కలెక్టరెట్ ఎదుట జరిగే మహానిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల యుటిఎఫ్ నాయకులు హనుమంతు, సుధాకర్, నరసయ్య, హనుమన్న, కాంతారావు లు పాల్గొన్నారు.

పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలి : సిఐటియు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అంజిబాబు

సమస్యల పరిష్కారానికి పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజిబాబు కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ,విద్యుత్ కార్మికులు ఉధృతమైన ఆందోళనలు చేపట్టారన్నారు. ఆందోళన లో భాగంగా విడతల వారీగా కార్యక్రమాలు ఉన్నాయని, వాటిని కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులు ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపు వచ్చినట్లు తెలిపారు. అందులో భాగంగా మోటర్ బైక్ ర్యాలీలు, జనరల్ బాడీ లు నిర్వహించాలని కోరారు. విద్యుత్తు పవర్ జెఎసి ప్రభుత్వంతో లాలూచీపడి కార్మికులకు నష్టదాయకమైన ఒప్పందం చేసిందని, విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్ పరిష్కారం కొరకు స్ట్రగుల్ కమిటీ నాయకత్వంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ కార్మికుల చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 17వ తేదీన అసంఘటితరంగా కార్మికులకు సమగ్రమైన చట్టం తీసుకురావాలని హమాలి కార్మికులు కలెక్టరేట్‌కు కదిలి రావాలని కోరారు. ఆగస్టు 18న కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చలో విజయవాడ ఉంటుందని దాని జయప్రదానికి కార్యకర్తలు అందరూ కషి చేయాలన్నారు. ఆగస్టు 19న శ్రామిక మహిళా జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని, జయప్రదానికి శ్రామిక మహిళలందరూ కదిలి రావాలని కోరారు. స్వాతంత్ర ఉద్యమ స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఆట పాట మాట కార్యక్రమం ఈ నెల 14న జరుగుతుందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. రామాంజనేయులు అధ్యక్షత వహించారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, కార్యదర్శిలు ఉమాదేవి,ఉపాధ్యక్షులు ఈరన్న, ప్రభాకర్, సిహెచ్.సాయిబాబా, విజయ్ పాల్గొన్నారు.

ఎర్రగుడిలో రోడ్లు వేయాలి

రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలిపిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తుగ్గలి

మండలం పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్లు శిథిలా వ్యవస్థకు చేరుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డుపైనే వరి నాట్లను నాటి నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, మండల కమిటీ సభ్యుడు కొండారెడ్డి మాట్లాడుతూ గుత్తి -పత్తికొండ ప్రధాన రహదారి ఎర్రగుడి రోడ్డు పూర్తిగా పాడైపోయిందన్నారు. దీంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. పలుసార్లు ఆర్ అండ్ బి అధికారులకు చెప్పినప్పటికీ వారు నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఎర్రగుడి నుండి దాదాపు 5 కిలోమీటర్ల మేర పూర్తిగా రోడ్లన్నీ దెబ్బతిన్నాయని, అధికారులు ఇంతవరకు మరమ్మతులు కూడా చేయలేదన్నారు. చెన్నై, బెంగళూరు నుండి ఎక్కువగా మంత్రాలయానికి వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలు కూడా ఎక్కువగా తిరుగుతుంటాయన్నారు. గుంతల పడిన రోడ్లలో ప్రయాణాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. సిపిఎం నాయకులు రాజు, లింగన్న, జయరాము, గ్రామస్తులు భీమన్న, వెంకటేశు,రామంజి, ఎర్రి స్వామి, ఓబులేసు, గోవిందు, సాలప్ప, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కెఇ.శ్యాంబాబు

అక్రమ కేసులు పెట్టేందుకే ఎమ్మెల్యే పర్యటన

- ముందస్తు ప్రణాళికలో భాగంగానే పోలీసుల మోహరింపు

ప్రజాశక్తి-పత్తికొండ : టిడిపికి కంచుకోటగా ఉన్న గ్రామంలో అక్రమ కేసులు పెట్టాలనే కోణంలోనే ఎమ్మెల్యే శ్రీదేవి పుచ్చకాయలమాడ గ్రామ పర్యటించిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కెఇ.శ్యామ్‌బాబాబు అన్నారు. శుక్రవారం పత్తికొండ టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారిక పర్యటనకు ఎమ్మెల్యేలు సాధారణంగా అధికారులు సిబ్బందితో పర్యటిస్తారన్నారు. అయితే పుచ్చకాయల మాడ పర్యటనలో ముందస్తుగా గ్రామంలో వందల మంది పోలీసులను మోహరించారని, ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలను వందల మందిని గ్రామానికి ఎమ్మెల్యే ఎందుకు తీసుకెళ్లారో చెప్పాలన్నారు. ప్రశ్నించిన గ్రామస్తులపై రాత్రికి రాత్రి నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టించడం సరైందికాదన్నారు. గ్రామంలో టిడిపి ఆధిపత్యం తగ్గించాలన్న పథకం ప్రకారం.. ఎమ్మెల్యే కార్యక్రమం సాగిందన్నారు. గ్రామ స్తుల తరపున తాము న్యాయపోరాటం చేస్తామన్నారు. టిడిపి నాయ కులు బత్తిన వెంకటరాముడు, బత్తిన లోకనాథ్ ,రామానాయుడు మనో హర్ చౌదరి అశోక్ కుమార్, తిరుపాల్, సోమ్లానాయక్, ధనుం జయుడు, శ్రీనివాసులు గౌడ్, కడవల సుధాకర్, శ్రీకాంత్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సీనియర్ జర్నలిస్టు మధుకు ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

సీనియర్ జర్నలిస్టుకు ఆర్థిక సాయం

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి : డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు శ్రీరాంనగర్‌లో అనారోగ్యంతో గుండె ఆపరేషన్ చేయించుకున్న సీనియర్ జర్నలిస్టు మధుకు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం మధు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు పనిఒత్తిడిలో ఉండి సమయానికి ఆహారం తీసుకోవడం లేదని, దీంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని డాక్టర్ శంకరశర్మ అన్నారు. వారు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అందుకే ప్రాణాయామం, యోగాసనం చేయాలని, మాంసాహారాన్ని తగ్గించి ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తినాలని సూచించారు. నా వంతుగా జర్నలిస్టులకు చేదోడు వాదోడుగా అండగా ఉంటానని అన్నారు. సమాజాభివద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదిగా పని చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిజెఎఫ్ ఫోటో వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామస్వామి, చెన్నయ్య పాల్గొన్నారు.

కుంట తూము ప్రారంభం

ప్రజాశక్తి-సి బెళగల్



బ్రాహ్మణదొడ్డి కుంట తూమును కోడుమూరు ఇంచార్జి హర్షవర్ధన్ రెడ్డి , సర్పంచి దస్తగిరి, మౌలాలి, బొబ్బిలి రాముడు, సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ కుంట కింద సుమారు 100 ఎకరాలు ఆయకట్టు ఉందని, కుంట పూర్తిగా నిండినందున వరి సాగు సన్నద్ధంలో భాగంగా తూముకు పూజలు చేశారు. ఇక్కడే కోట్ల హర్ష వస్తున్నారని తెలిసి ఆయా గ్రామాల వైసిపి కార్యకర్తలు ఘనస్వాగతం పలికి ఊరేగించారు.

సంక్షేమంతోనే పేదరికం దూరం

- ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

సంక్షేమంతోనే పేదరికం దూరమవుతుందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 30వ వార్డులో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి వార్డు ప్రజల సమస్యలు మురుగు కాలువలు, తాగునీటి వసతి, వీధిదీపాలు, కల్వర్టులను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతవరకు అందాయని తెలుసుకుంటూ ముందుకు సాగారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శాంత, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, సీనియర్ నాయకులు చంద్ర కాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, స్టేట్ డైరెక్టర్ రేణుక, వైస్ చైర్మన్ గౌస్, వార్డు ఇన్‌ఛార్జి బిటి.లక్ష్మణ్, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ కృపాకర్, రాజశేఖర్ రెడ్డి, నాయకులు సింహం నాగేంద్ర, డీలర్ నాగరాజ్, విబి.వెంకటేష్, జయపాల్, తాయన్న, తిమ్మప్ప, బాబు, శంకర్, కిశోర్, రామలింగేశ్వర యాదవ్, ముని, లక్ష్మన్న మమ్ముత్ స్వామి, చిన్న ఈరన్న, సంజీవ్, లక్ష్మీనారాయణ, రాము, ఆనంద్, రంగ, చిన్న వీరప్ప, హాల, భవాని, మల్లి పాల్గొన్నారు.

మహిళల ఆదరణే వైసిపికి అండ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

మహిళల ఆదరణే వైసిపి ప్రభుత్వానికి కొండంత అండ అని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం పొదుపు సంఘాలకు వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాల విడుదలపై వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు చెప్పే మాయ మాటలను మోసపోవద్దని సూచించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో, రాజకీయ రంగంలో కూడా 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగనికే దక్కుతుందని తెలిపారు. నాలుగో విడత వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాల ద్వారా నియోజకవర్గంలో 5,094 గ్రూపుల్లో సుమారు 60 వేల మంది మహిళలకు రూ.527.13 కోట్ల లబ్ధి చేకూరుతోందని చెప్పారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, ఇన్‌ఛార్జి విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, మండల ఉపాధ్యక్షులు పులికుక్క రామచంద్ర, ఎంపిటిసి జి.వెంకటేష్, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర ఆచారి, కోసిగి మాజీ జడ్‌పిటిసి మంగమ్మ, నాయకులు జనార్దన్ రెడ్డి, కౌతాళం మండల ప్రహ్లాదరెడ్డి, ఎస్ఐ వేణు గోపాల్ రాజు పాల్గొన్నారు.

పాదయాత్ర నాయకులకు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

పూలమాలలు వేసి సన్మానిస్తున్న నాయకులు

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఈనెల 2 నుంచి 7 వరకు ఆదోని నుంచి కర్నూలు వరకు చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్న నాయకులను సన్మానించారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, వెంకటేశులు, పట్టణ నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్, మండల కార్యదర్శి లింగన్న మాట్లాడారు. స్థానిక సమస్యలతోపాటు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర దిగ్విజయంగా సాగిందని తెలిపారు. పాదయాత్ర ప్రభావం అధికార్లలో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. మహా పాదయాత్ర పట్ల ప్రజల్లో కూడా సానుకూల చర్చ నడిచిందన్నారు. ఆరు రోజులపాటు కొనసాగిన పాదయాత్ర సందర్భంగా ప్రజల నుంచి అడుగడుగునా ఘన స్వాగతం లభించిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. నాయకులు గోపాల్, తిప్పన్న, వీరారెడ్డి, నాగరాజ్, ముక్కన్న, మాబాష, నాగేంద్ర, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కైరుప్పలలో కూరగాయల మార్కెట్ వేలం

ప్రజాశక్తి - ఆస్పరి

వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ సెక్రటరీ రామ్మూర్తి

మండలంలోని కైరుప్పల గ్రామంలో దినసరి కూరగాయల మార్కెట్ వేలంపాటలు శుక్రవారం నిర్వహించారు. సర్పంచి తిమ్మక్క అధ్యక్షతన వేలంపాటలు ప్రారంభించారు. ఈ వేలంపాటలో 9 మంది పాటదారులు పాల్గొన్నారు. బోయ గోపాల్ రూ.8.72 లక్షలకు వేలంపాట పాడి దక్కించుకున్నారు. గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి రూ.4.36 లక్షలు, గ్రామ పంచాయతీకి రూ.4.36 లక్షలు జమ చేస్తామని పంచాయతీ సెక్రటరీ రామ్మూర్తి తెలిపారు. వైసిపి నాయకులు బీటెక్ వీరభద్రి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాయామం తప్పనిసరి : ఎస్పీ

ప్రజాశక్తి - ఆదోని

ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి అని ఎస్పీ జి.కృష్ణకాంత్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు క్వార్టర్స్ ఆవరణలో కర్నూలు మెడికవర్, ఆదోని మధు ఆస్పత్రి ఆధ్వర్యంలో డీఎస్పీ శివనారాయణ స్వామి అధ్యక్షతన పోలీసులకు ఉచిత హెల్త్ చెకప్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడారు. విధుల్లో భాగంగా గతంలో పోలీసులు సైకిల్‌పై బయటకు వెళ్లే వారని తెలిపారు. దీనివల్ల శరీరానికి కొంత వ్యాయామం లభించేదన్నారు. ఆరోగ్యం పదిలంగా ఉండేదన్నారు. ప్రస్తుతం బిజీ కారణంగా బైకులు, వాహనాలు ఉపయోగించడం వల్ల శరీర శ్రమ తగ్గి ఊబకాయం వస్తోందని తెలిపారు. బందోబస్తు విధుల్లో సమయానికి తిండి తినకపోవడంతో గ్యాస్ ట్రబుల్ ఏర్పడి శరీరం లావెక్కిన పరిస్థితి ఉందన్నారు. విధుల్లో భాగంగా కుటుంబాలకు దూరంగా ఉండి ఎక్కువ ఆలోచించి మానసిక రుగ్మతలకు గురై అనారోగ్యాలు పాలైన వారి సంఖ్య కూడా రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. బిపి, షుగరు, కిడ్నీ, ఇతర వ్యాధులు కొందరిలో తీవ్రంగా వేధిస్తున్నాయన్నారు. ఇటీవల ట్రాన్స్‌ఫార్ల సమయంలో చాలామంది అనారోగ్య సమస్యలతోనే రిక్వెస్ట్ పెట్టుకున్నారని తెలిపారు. డైట్‌లో రాగులు, కొర్రలు, జొన్నలు, సజ్జలతో తయారు చేసిన వంటకాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ... పోలీసుల ఆరోగ్యం గురించి ఉచిత క్యాంపు పెట్టాలని అడగ్గానే ఆదోని మధు ఆస్పత్రి, కర్నూలు మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఆదోనిలోని ఎస్‌కెడి కాలనీలో మధు ఆస్పత్రిలో ఉద్యోగులకు ఈహెచ్ఎస్, సామాన్యులకు ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందన్నారు. అనంతరం డాక్టర్లను డీఎస్పీ శివ నారాయణ స్వామి సన్మానించారు. కర్నూలు మెడికవర్ ఆస్పత్రి డాక్టర్ సమీరా, మధు ఆస్పత్రి ఆర్థోపెడిక్ శివశంకర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సునీల్, ఆరోగ్య భద్రత విభాగం ఇన్‌ఛార్జి జిలాని, సిఐ విక్రమ్ సింహ, నరసింహారాజు, శ్రీనివాస్ నాయక్, పార్థసారథి, ఎస్ఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.

హెల్త్ క్యాంపులో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

వైద్య పరీక్షలు చేస్తున్న మధు ఆస్పత్రి డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి

ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు భవనాలు నిర్మించాలి

- ఎస్ఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు నిధులను కేటాయించి భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. శుక్రవారం అంబేద్కర్ సర్కిల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి పరమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షులు ధనుంజయ్ మాట్లాడారు. ఆలూరులో ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలకు సొంత భవనాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఆలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించినా సొంత భవనాలు నిర్మించడంలో ప్రభుత్వాలు, స్థానిక పాలకులు విఫలం చెందారని విమర్శించారు. ప్రస్తుత డిగ్రీ కళాశాల ప్రభుత్వ బాయ్స్-2 పాఠశాలలోని కొన్ని గదులను ఇవ్వడంతో అందులోనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఐటిఐ కళాశాలను 2008లో కళాశాల ఏర్పాటు చేస్తే నేటి వరకు సొంత భవనాలు లేవని చెప్పారు. ఐటిఐ కళాశాల బాయ్స్-1 హైస్కూల్‌లో పురాతన భవనాల్లో భయం గుప్పెట్లో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. 2019లో ఐటిఐ కళాశాలకు అగ్రహారం గ్రామం దగ్గర స్థలం కేటాయించారని చెప్పారు. ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు ఉలిరాజు, మండల నాయకులు మధు, లింగమూర్తి, మల్లారెడ్డి, గాదిలింగ, శివశంకర్, శివరాజు, మల్లి, ప్రవీణ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపడుతున్న నాయకులు

నేడు 12 గంటల నిరసన : ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 12న కర్నూలులోని శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద జరిగే 12 గంటల నిరసనను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తాలూకా కన్వీనర్ వెంకటరాముడు, కోకన్వీనర్లు బసవరాజు, పాపన్న, మాదన్న, ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లప్ప, కరెకృష్ణ కోరారు. శుక్రవారం స్థానిక వీవర్స్ కాలనీ హై స్కూల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. జిఒ 117ని రద్దు చేయాలని, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో బాధ్యులు బాబయ్య, కాశీం, జి.వీరేష్, సురేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

రాష్ట్ర భవిష్యత్తుకు బాబు కృషి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ
- 'గురురాఘవేంద్ర' కడకొమ్మను పగులగొట్టడం దారుణం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్ర ప్రజల భవిషత్తు కోసం టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు నిత్యం రాజీలేని పోరాటం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును విమర్శించడంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కర్నూలు పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు గతంలో టిడిపి హయాంలో ఆర్‌డిఎస్ ప్రాజెక్టు కోసం సుమారు రూ.1980 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. టిడిపి ప్రభుత్వం కేవలం పేపర్ మాత్రమే మంజూరు చేసిందని అధికారంలోకి వచ్చిన వైసిపి మంత్రులు, శాసన సభ్యులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. రివర్స్ టెండర్ పిలిచింది వైసిపి ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. టిడిపి హయాంలో మంజూరు చేసిన ఆర్‌డిఎస్ ప్రాజెక్టును పూర్తి చేయడం చేతకాక ఈ ప్రాజెక్టు కెసిఆర్ పరిధిలో ఉందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రాజెక్టులను కడుతుందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం మాత్రం నందవరం మండలంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు, చిలకలడోన ప్రాజెక్టుకు నీరు ఎక్కువై పరిసర పొలాలు నీట మునుగుతున్నాయని ప్రాజెక్టు కడగొమ్మును పగలగొట్టడం ఏమిటని ప్రశ్నించారు. పంటలు నీట మునుగుతుంటే రైతులకు నష్టపరిహారం అందించాలని, ప్రాజెక్టులను కూల్చడం ఏమిటని నిలదీశారు. నేటి నుంచి గోనెగండ్ల మండలంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ', పల్లెనిద్ర కార్యక్రమాలు మొదలు పెడుతున్నామని తెలిపారు. మాజీ జడ్‌పిటిసి ఈరన్న గౌడ్, ఎల్ఎల్‌సి మాజీ డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ సర్పంచి ఖాసీం వలీ, టిడిపి మండల నాయకులు బండే గురు స్వామి, గోపాల్, గురురాజ్ దేశాయ్, హాలహర్వి దావీదు, జబ్బార్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే 'పల్లెనిద్ర'

గోనెగండ్ల : గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకొని వారితో మమేకమవ్వడమే 'పల్లెనిద్ర' ఉద్దేశమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో 'పల్లెనిద్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న ఆయన టిడిపి మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి టిడిపి జెండాను ఆవిష్కరించారు. కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు, బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రజలు, మహిళలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. రాత్రి గ్రామంలోని మాజీ సర్పంచి ఈరన్న ఇంటి ఆవరణలో బస చేశారు. టిడిపి మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, నాయకులు తిరుపతయ్య నాయుడు, ఎన్‌వి.రామాంజనేయులు, పూజారి చంద్ర, రంగస్వామి నాయుడు, బసవరాజు స్వామి, చిన్న నేలటూరు నాగన్న, మాజీ సర్పంచి ఈరన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల : మాట్లాడుతున్న బీవీ

గేట్ ఎక్కి పాఠశాలలోకి వెళ్తున్న విద్యార్థులు

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 8.40 గంటలైనా ఉపాధ్యాయులు, ఆయాలు, గేట్ కాపలాదారుడు సమయానికి పాఠశాలకు రావడం లేదు. విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఊరు బయట ఉన్నందు వల్ల ఎవరూ సమయపాలన పాటించడం లేదని విద్యార్థులు తెలుపుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కెట్ యార్డు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు...

- స్వీకరించిన మాధవ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రథమ శ్రేణి కార్యదర్శి కె.ఉమాపతి రెడ్డి సెలవుపై వెళ్లడంతో ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శిగా డిపి.మాధవ కృష్ణారెడ్డి శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు వ్యవసాయ కమిటీలో కమీషన్ ఏజెంట్లు ఎవరైనా మోసం చేసినా, అక్రమాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకొని వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈఏడాది రూ.4.50 కోట్ల లక్ష్యానికి గాను రూ.1.38 కోట్లు సాధించినట్లు తెలిపారు.

ఒకే రోజు రెండు పరీక్షలు...

- విద్యార్థులు నష్టపోతారు
- యుటిఎఫ్, డిటిఎఫ్, ఎస్‌టియు

ప్రజాశక్తి - హొళగుంద

ఈనెల 19న యూనివర్సిటీ బిఎడ్ ఫోర్త్ సెమ్ పరీక్షలు, ఐబిపిఎస్ క్లర్క్ ప్రిలిమ్స్ పరీక్షలు ఒకేరోజు నిర్వహించడం వల్ల విద్యార్థులు నష్టపోతారని యుటిఎఫ్ నాయకులు కబీర్ సాహెబ్, డిటిఎఫ్ నాయకులు మారెప్ప, ఎస్‌టియు నాయకులు పాండురంగరాజు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రెండు పరీక్షలూ ఒకేరోజు నిర్వహిస్తే రెండు పరీక్షలు రాయడానికి అర్హత ఉన్న విద్యార్థులు రాయడం కుదరదని తెలిపారు. పరీక్ష తేదీలను మరోసారి పరిశీలించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ప్రతి పరీక్ష విద్యార్థులకు పోటీతత్వంతో కూడుకుని ఉండడం వల్ల, ప్రతి పరీక్షపై విద్యార్థులు ఆధారపడక తప్పడం లేదన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ విద్యార్థులను జరుగుతున్న అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని బిఎడ్ ఫోర్త్ సెమ్ ఎగ్జామ్స్‌ను వాయిదా వేసి మరో తేదీలో నిర్వహించుకోవాలని కోరారు.

రైతులకు ఉపయోగపడే నిర్ణయాలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో నిర్వహించే చర్చల ద్వారా రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని హెచ్.కైరవాడి ఆర్‌బికెలో గోనెగండ్ల మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ జి.హేమలత ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మహేశ్వరరెడ్డి హాజరయి మాట్లాడారు. మండల వ్యవసాయ సలహా మండలి నిర్ణయాలను జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పరిశీలించి రైతులకు ఉపయోగకరమైన నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఎఒ ద్వారా అమలయ్యే పథకాలను రైతులకు వివరించారు. అనంతరం ఆర్‌బికెలలో ఎరువులను పరిశీలించి రైతులకు ఎరువులు పంపిణీ చేసి, రైతు భరోసా మాస పత్రికలను అందజేశారు. ఉద్యానవన శాఖ అధికారిని శ్రీవాణి, విఎహెచ్ స్వామి, విఒఎ లక్ష్మన్న పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి- హాలహర్వి

మండలంలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం ఉపాధి కూలీ మధుగన్న (48) మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు... ఉదయం ఉపాధి పనులకు గ్రామస్తులతో కలిసి మధుగన్న, ఆయన భార్య వెళ్లారు. పని చేస్తుండగా ఒక్కసారి లోబీపీతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య రాములమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏపీడీ పకీరప్ప, ఏపీఓ శ్రీనివాసులు బాధితులను పరామర్శించి మృతికి సంతాపం తెలిపారు.

మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం, వ్యకాస

ఆలూరు : మృతి చెందిన ఉపాధి కూలీ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిపిఎం హాలహర్వి మండల కార్యదర్శి కృష్ణ కోరారు. ఆలూరు జ్యోతిబసు భవనంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి, సిఐటియు నాయకులు విఠల్, వ్యకాస నాయకులు వీరేశ్, ధనుంజయ పాల్గొన్నారు.

రైతుల కోసం ఎందాకైనా వెళ్తాం : టిడిపి

ప్రజాశక్తి - నందవరం

రైతుల కోసం ఎందాకైనా వెళ్లేందుకు టిడిపి సిద్ధంగా ఉందని టిడిపి మండల సీనియర్ నాయకులు ఖాసీం వలీ, నాగరాజ్ గౌడ్, గడ్డం నారాయణ రెడ్డి, గురురాజ్ దేశాయ్, బండే గురు స్వామి తెలిపారు. శుక్రవారం చిలకలడోన పరిధిలోని మాచాపురం ఎత్తిపోతల చెరువు కడకొమ్మ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దాదాపు 12 ఏళ్ల క్రితం మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి మాచాపురం రైతులను దృష్టిలో ఉంచుకొని శ్రీగురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని చిలకలడోన దగ్గర ఏర్పాటు చేసి సాగు, తాగునీటి సౌకర్యం కల్పించారని తెలిపారు. ఎఇ శ్యాం కొంతమంది అధికార పార్టీ నాయకుల మాటలు విని 350 ఎకరాల కోసం ఏర్పాటు చేసిన కడకొమ్మను ఒక అడుగు మేర పగులగొట్టించారని చెప్పారు. 350 ఎకరాలకు నీరందించే చెరువును 20 మంది రైతుల కోసం పగులగొట్టడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి 20 మంది రైతులకు నష్ట పరిహారం ఇప్పించలేరా అని ప్రశ్నించారు. రైతులకు నష్టం జరుగుతుందంటే పరిహారం ఇప్పించాలని, కడకొమ్మను ధ్వంసం చేయడం ఏమిటని నిలదీశారు. కడుకొమ్మను పగులగొట్టడం వల్ల వర్షాలు ఎక్కువగా వస్తే నీరు నిల్వ ఉండకుండా వృథాగా నదిలో కలుస్తుందన్నారు. వైసిపి నాయకుల మాటలు విని అధికారులు కోర్టుల్లో నిందితులు కావద్దన్నారు. అధికారులు స్పందించి కడకొమ్మను తిరిగి నిర్మాణం చేపట్టాలని, లేకపోతే హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామన్నారు. రైతులు హనుమంతు, బడేసాబ్, నాగేష్ పాల్గొన్నారు.

కడకొమ్మను చూపుతున్న నాయకులు

అనాథ బాలలకు చెక్కును అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ

అనాథలను ఆదుకోవడం గొప్ప సాయం

- ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

అనాథ పిల్లలను ఆదుకోవడం కన్నా మించిన సహాయం ఇంకేది లేదని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలోని ఫాతిమా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సరమూనీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో 16 మంది అనాథ విద్యార్థులు చదువుతున్నారని తెలిసి ముందుగా పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అనాథ బాలలను అక్కున చేర్చుకొని చలించి పోయారు. చిన్నతనంలోనే తల్లిదండ్రుల ప్రేమకు నోచుకోని ఆ చిన్నారులకు ఆశ్రయం కల్పించి విద్యాబుద్ధులు అందిస్తున్న పాఠశాల యాజమాన్యం ఆదరణను చూసి ప్రశంసించారు. అనాథ పిల్లల బాగోగుల కోసం అక్కడికక్కడే తక్షణ సహాయం కింద రూ.50 వేల చెక్కును పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ 16 మంది అనాథ పిల్లల బాగోగుల కోసం ఇక నుంచి ప్రతేడాది తన వంతు సహాయంగా రూ.50 వేలు అందజేస్తానని హామీఇచ్చారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి రూ.10 వేలు సహాయంగా అందించారు. ఈ నగదును కూడా ప్రతేడాది కొనసాగిస్తానన్నారు. ప్రధానోపాధ్యాయులు అజిత, వైసిపి కన్వీనర్ రంగస్వామి, కోకన్వీనర్ హనుమన్న, మాజీ సర్పంచి కొండా శేఖర్, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, శ్రీధర్, సతీష్, ఆనంద్ పాల్గొన్నారు.

కోలుకున్న 9 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చిన చాక్లెట్లు తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకున్నారని వైసిపి మండలాధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఎస్ఐ వేణుగోపాల్ రాజు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం స్థానిక వెంకటేశ్వర ప్రైమరీ స్కూల్‌లో 2, 3వ తరగతి చదువుతున్న విద్యార్థులు సుమారు 30 మంది బస్టాండ్ దగ్గర సూగూరుకు వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి విద్యార్థులకు చాక్లెట్లు పంచాడని తెలిపారు. వాటిని తిన్న 9 మంది వాంతులు చేసుకున్నారని చెప్పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు 108 అంబులెన్స్ ద్వారా కలుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పరీక్షించిన వైద్యులు ప్రమాదం లేదని, పాఠశాల వదిలే ముందు అల్బెండజోల్ టాబ్లెట్లు విద్యార్థులకు ఇచ్చినందున ఈ సమస్య తలెత్తిందని చెప్పారు. వెంటనే స్పందించిన పిహెచ్‌సి వైద్యులు గోవిందమ్మ, భావనను ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అభినందించారని భీమిరెడ్డి పేర్కొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి

ప్రజాశక్తి - దేవనకొండ

పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం దేవనకొండ శివారులో రైతు బోయ శేఖర్ పొలంలో ఎఒ సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్, సిసిహెచ్ 369 కంపెనీ నిర్వహించిన పత్తి పంట క్షేత్ర ప్రదర్శనను పరిశీలించారు. పత్తి సాగు, యాజమాన్య పద్ధతుల వివరాలను రైతు శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. క్రిస్టల్ రీజినల్ మేనేజర్ వై.రఘునాథరెడ్డిని పంట దిగుబడి, కాల పరిమితి గురించి అడిగి తెలుసుకున్నారు. తక్కువ సమయంలో పత్తి పంట దిగుబడి ఆశాజనకంగా వస్తుందని క్రిస్టల్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎఇఒ యోగేంద్ర బాబు, రంగన్న, విఎఎ రంగన్న, క్రిస్టల్ సేల్స్ మేనేజర్ వీర బ్రహ్మయ్య, వెంకట సాయి ట్రేడర్స్ సదాశివరావు, వేణుగోపాల్‌రావు, హనుమాన్ ఫర్టిలైజర్స్ సిలివేరి శ్రీరాములు పాల్గొన్నారు.

మద్దతు కావాలని విజ్ఞప్తి : టిడిపి

ఆదోని : వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో టిడిపి తరపున బరిలో దిగితే మద్దతు ఇవ్వాలని ముస్లిం మతపెద్దలకు టిడిపి సీనియర్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ముస్లిం మతపెద్దలు, ముస్లిం ప్రముఖ నాయకులు, సీనియర్ జర్నలిస్టులను ఆదోని టిడిపిలోని మరోవర్గం నాయకులు కలిసి మద్దతు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఖాజీపురలో ముస్లిం మత పెద్ద ఖాజీ అల్తాఫ్ హుస్సేన్‌ను, ఖతిబ్ సాబ్ జునైద్ హాష్మిని కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. టిడిపి నాయకులు సౌదీ రావుఫ్, సూరం భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, మాజీ కౌన్సిలర్ రామచంద్ర మాట్లాడారు. టిడిపి అధిష్టానం నుంచి తమలో ఒకరికి గ్రీన్ సిగ్నల్ వస్తుందని తెలిపారు. తమకు అండగా ఉండాలని కోరారు. ముస్లిం నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ ఈశా బాషను ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. టిడిపి నాయకులు సోమశేఖర్ రెడ్డి, నారాయణపురం షేక్షావలీ, మల్లేశ్వరప్ప, మల్లికార్జున, రాముడు, కారుమంచి పాల్గొన్నారు.

చెరువులో బదినేహాల్ ఎపిజిబి

కౌతాళం : మండలంలోని బదినేహాల్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చెరువులో ఉందని, ఖాతాదారులు బ్యాంకులో రావడానికి దారి చూపాలని సిపిఎం మండల కన్వీనర్ మేలిగిరి ఈరన్న, ఉలిగయ్య కోరారు. శుక్రవారం బ్యాంకు ఆవరణలో నిలిచి ఉన్న నీటిని పరిశీలించి మాట్లాడారు. వర్షం వస్తే బ్యాంకు ముందు మోకాళ్ల లోతు నీరు ఆగి ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గరుసు వేయించాలని మేనేజర్‌ను కోరగా 'మాకు ఇది సంబంధం లేదు. పంచాయతీ వారు చూసుకోవాల'ని ఉచిత సలహా ఇచ్చినట్లు చెప్పారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. సిపిఎం నాయకులు శంకర్, మాబాష, చాంద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

14న 'జనజాగరణ'ను జయప్రదం చేయండి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14న చేపట్టే 'జనజాగరణ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న కోరారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో రైతుసంఘం, వ్యకాస, సిఐటియు సమావేశం సిఐటియు మండల కార్యదర్శి బి.వీరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతులను, కూలీలను, కార్మికులను విస్మరించి బడా కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. మతతత్వ విధానాల ద్వారా అన్ని వర్గాల ప్రజలను చీల్చి దేశాన్ని అధోగతి పాలు చేస్తోందని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతుసంఘం, సిఐటియు, వ్యకాస ఆధ్వర్యంలో ఈనెల 14న దేశవ్యాప్తంగా 'జన జాగరణ'ను గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్నట్లు చెప్పారు. జయప్రదం చేయాలని కోరారు. రైతుసంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, సిఐటియు మండల అధ్యక్షులు జె.రామాంజనేయులు, రైతు సంఘం మండల నాయకులు బాష, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దస్తగిరి బాషా, ఆటో వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి వీరేష్, సిఐటియు నాయకులు ఉరుకుందు, ఏలియా పాల్గొన్నారు.

'స్త్రీనిధి' ఎందుకోసం, ఎవరి కోసం

- ఐద్వా మండల అధ్యక్షులు షేకున్‌బీ

ప్రజాశక్తి-ఆలూరు

స్త్రీ నిధి పథకం రుణాలను పొదుపు గ్రూపులో ఇచ్చిన వారికే రుణాలు అందుతున్నాయని, ఇతర సభ్యులకు అందడం లేదని ఐద్వా మండల కార్యదర్శి షేకున్‌బీ మండిపడ్డారు. శుక్రవారం జ్యోతిబసు భవన్‌లో ఆమె మాట్లాడారు. పేద, మధ్యతరగతి మహిళల అభివృద్ధి కోసం, వారి వృత్తిలో ఉన్నతంగా ఎదగాలని అనేక రుణాలను అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చొప్పడానికే తప్ప అమలుకు నోచుకోవడం లేదన్నారు. స్త్రీ నిధి ద్వారా ప్రతి పొదుపు గ్రూపులో ప్రతి ఒకరికీ రుణాలు ఇవ్వాల్సి ఉండగా గతంలో ఇచ్చిన వారికే ఇస్తున్నారని తెలిపారు. కమీషన్ ఎవరిస్తే వారి గ్రూపునకు మాత్రమే మినిట్స్ రాయడం, సభ్యులకు తెలియకుండా మినిట్స్ బుక్‌లో ఖాళీ పేపర్‌లో ముందే సంతకాలు పెట్టించుకుని తర్వాత ఇష్టమొచ్చింది రాసుకొని డబ్బులు డ్రా చేస్తున్నారని చెప్పారు. ప్రతి పొదుపు గ్రూపునకూ ఆడిట్ నిర్వహించి అవినీతికి పాల్పడుతున్న బుక్ కీపర్లను, అధికారులను తొలగించాలని కోరారు. గతంలో కొంతమంది బుక్ కీపర్లు ప్రయివేట్ పెరల్స్ పథకానికి డిపాజిట్ చేస్తేనే మినిట్స్ రాసి పొదుపు రుణాలు ఇప్పిస్తామని భయభ్రాంతులకు గురి చేసి పొదుపు మహిళలతో కట్టించి వారిని ఆర్థికంగా నాశనం చేశారని తెలిపారు. మహిళా పొదుపు సంఘాలకు బుక్ కీపర్లుగా మహిళలనే నియమించాలని డిమాండ్ చేశారు. పొదుపు రుణాలపై ప్రతి ఇంటికీ ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి మహిళలను చైతన్య పరిచి అక్రమాలను వెలికితీస్తామని తెలిపారు.

చెక్ పంపిణీ చేస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ పి పి నాగిరెడ్డి తదితరులు

యథేచ్ఛగా నకిలీలు

- బయో పేరుతో పురుగు మందుల విక్రయం
- కోట్లల్లో సాగుతున్న దందా

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నకిలీ పురుగు మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. బయో పురుగు మందుల పేరుతో మార్కెట్‌లో వాటి విక్రయాలు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఆ దందా కోట్లల్లో సాగుతోంది...

బయో కంపెనీల పేరుతో నకిలీ పురుగు మందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సదరు కంపెనీలు విక్రయదారులకు ప్రోత్సహాలు ఇస్తూ తమ వ్యాపారాలను వృద్ధి చేసుకుంటున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో దాదాపు కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో దాదాపు రూ.2కోట్లకు పైగా ఈ నకిలీ పురుగు ముందుల విక్రయాలు సాగాయి. నంద్యాల జిల్లాలోనూ అదే స్థాయిలో విక్రయాలు సాగాయి. నంద్యాల జిల్లాలో దాదాపు రూ.1.5కోట్ల మేర వాటి విక్రయాలు జరిగాయి. వాస్తవానికి మల్టీ నేషనల్ కంపెనీలు 0.01 శాతం పురుగు మందుల అవశేషాలు ఉండేలా పురుగు మందుల ఉత్పత్తులను విక్రయిస్తున్నాయి. పత్తి, మిరప పంటలకు సంబంధించి మోతాదుకు మించి బయో ఫర్టిలైజర్స్‌ను రైతులు వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో లభించి పురుగు మందుల కంటే వీటి ధర తక్కువగా ఉండటంతో రైతులు బయో పురుగు మందుల వైపు మొగ్గుచూపుతున్నారు. బయో ఫర్టిలైజర్స్ నమూనాలను తీసి ప్రతి ఏటా ల్యాబ్‌కు పంపాలని వ్యవసాయ శాఖ నిబంధనలు చెబుతున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో బయో ఫర్టిలైజర్స్‌కు సంబంధించి కర్నూలు జిల్లాలో 15, నంద్యాల జిల్లాలో 5 నమూనాలను తీసి పంపాలని వ్యవసాయ శాఖ అధికారులు లక్ష్యాలను నిర్దేశించారు. రాష్ట్రంలో గుంటూరు, కృష్ణా, తిరుపతి, పశ్చిమ గోదావరి, పల్నాడు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో మొత్తం 47 బయో పురుగు మందుల తయారీ సంస్థలు ఉన్నాయి. ఇవి 662 రకాల బయో పురుగు మందుల ఉత్పత్తులను విక్రయిస్తున్నాయి. వీటి విక్రయాలు దేశ వ్యాప్తంగా సాగుతుండగా మన రాష్ట్రంలో అధికంగా విక్రయాలు సాగిస్తున్నాయి. నీటి పారుదల ప్రాంతాల్లో ఈ బయో ఉత్పత్తుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కర్నూలు జిల్లా కేంద్రంగా బయో పురుగు మందులను తయారు చేసి ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణలోనూ విక్రయాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా కంపెనీల విక్రయాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఈ బయో పురుగు మందుల వ్యాపారం జిల్లాలో మండల కేంద్రాల నుంచి గ్రామాలకు కూడా చేరింది. గ్రామాల్లో అనధికారికంగా ఇళ్లలో ఈ బయో పురుగు మందుల విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో నకిలీ పురుగు మందుల విక్రయాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. నకిలీ పురుగు మందుల విక్రయాలను పర్యవేక్షించాల్సి అడ్డుకట్ట వేయాల్సిన విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి.

మహిళల ఆత్మస్థైర్యానికి ప్రభుత్వం పెద్దపీట

- మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి - వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లాకు రూ.48.95 కోట్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్వయం సహాయక సంఘ మహిళల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంచడం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకోసమే వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తోందని మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, జనుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ వేదిక ద్వారా వరుసగా నాలుగో ఏడాది స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లబ్ధి మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, హస్త కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డిఆర్ఓ పుల్లయ్య, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ చైర్మన్ పి.పి నాగిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక ప్రగతి కోసం.. సున్నా వడ్డీ లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి, రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. వరుసగా నాలుగో ఏడాది వైయస్సార్ సున్నా వడ్డీ పథకం కింద జిల్లా వ్యాప్తంగా పట్టణం, గ్రామీణంలో ఉన్న 36,626 స్వయం సహాయక సంఘాలకు గాను "సున్నా వడ్డీ" సాయం మొత్తం రూ.48.95 కోట్లను ప్రభుత్వం విడుదల చేయడం జరిగిందన్నారు. మహిళ బాగుంటేనే ఇల్లు బాగుంటుందని తద్వారా గ్రామం, రాష్ట్రం, సమాజం బాగుంటుందని నమ్మి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన చేసి 90 శాతం పథకాలు మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. గ్రూపులో ఉన్న మహిళా సభ్యులు చిన్న చిన్న వ్యాపారం చేస్తూ పెద్ద, పెద్ద వ్యాపార వేత్తలుగా ఎదగాలన్నారు. మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్క చెల్లెమ్మల మీద ఏ మాత్రం వడ్డీ భారం పడకుండా, ప్రభుత్వమే వారి తరపున వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఆ భారాన్ని భరిస్తుందన్నారు. అనంతరం వరుసగా నాలుగో ఏడాది సంబంధించి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం క్రింద జిల్లాలోని పట్టణ, గ్రామీణ పరిధిలో 36,626 సంఘాలకు గాను మంజూరయిన రూ.48.95 కోట్ల మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో అందించారు.

పోతిరెడ్డిపాడు, బనకచర్ల నుండి
నీటి విడుదల

ప్రజాశక్తి - పాములపాడు

జూపాడుబంగ్లా మండలం పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ నుండి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారుడు, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి పూజలు నిర్వహించి బటన్ నొక్కి నాలుగు గేట్ల ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని తెలుగు గంగ(ఎస్ఆర్ఎంసి) కాలువకు విడుదల చేశారు. అనంతరం పాములపాడు మండలం బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుండి తెలుగు గంగ (టిజిపి) కాలువకు పూజలు నిర్వహించి బటన్ నొక్కి 5 వేల క్యూసెక్కుల నీటిని, ఎస్‌కెపి ఛానల్‌కు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్థర్ మీడియాతో మాట్లాడుతూ రైతులు ఎప్పుడు సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరుకుంటారని, రైతులకు పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేశామని తెలిపారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం శ్రీశైలంలో డ్యాములో 865 అడుగుల నీరు ఉందని, తెలంగాణ విద్యుత్ పేరుతో 42 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకున్నారన్నారు. రెండు రాష్ట్రాలు విడిపోయినప్పుడు విడిపోయినా కలిసి ఉన్నట్టే అని స్నేహపూర్వకంగా ఉందామని చెప్పిన కేసీఆర్ నీటిని తీసుకోవడం సరైనది కాదన్నారు. దామాషా ప్రకారం ఏపీకి 511 టీఎంసీలు తెలంగాణకు 299 టీఎంసీలు రావాల్సి ఉందన్నారు. తెలంగాణలో పాలమూరు, దిండి, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా నీటిని తరలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరమణయ్య, డిఈ హరినాథ బాబు, జేఈలు మధుసూదన్ రావు, విశ్వనాథ్, దేవేంద్ర పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యేలు

మాట్లాడుతున్న ఎంపి, ఎమ్మెల్యేలు, గంగుల

లింగాల లిఫ్ట్ ఇరిగేషన్ నుండి నీటి విడుదల

లింగాల ఎత్తిపోతల పథకం నుండి పంట పొలాలకు నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ పూజలు నిర్వహించి బటన్ నొక్కి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాల, చెలిమిల్ల, కొక్కెరంచ గ్రామాల వరకు రైతులకు పంటలు ఎండిపోకుండా సాగిన విడుదల చేశామన్నారు. 72 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో డిఈ నాగార్జున, ఏఈ నారాయణరెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.

విబిఆర్‌కు నీటి విడుదలతో రైతన్నల హర్షం

బండి ఆత్మకూర్ : శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 12,000 క్యూసెక్కుల నీటిని వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ రిజర్వాయర్‌లోకి ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణి రెడ్డి, తోగూరు ఆర్థర్, జలవనరుల సలహాదారుః మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ మేరకు బండి ఆత్మకూరు మండలంలోని రైతు సోదరులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

ప్రజాశక్తి -ప్యాపిలి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెంగళంపల్లె సమీపంలోని ఎన్‌హెచ్ 44 నుంచి వెంగళంపల్లె వరకు కోటి రూపాయలతో వేసిన పి.ఆర్ రోడ్డును మంత్రి శుక్రవారం ప్రారంభించారు. కొత్త రోడ్డుపై రెండు కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు మూడు దశాబ్దాలుగా రోడ్ల సౌకర్యం లేని గ్రామాలకు కొత్తగా రోడ్డ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ప్రజల చెంతకే ప్రభుత్వ పాలన అందించాలన్న ఉద్దేశంతో సచివాలయం వ్యవస్థ రైతు భరోసా కేంద్రాలు హెల్త్ క్లినిక్ లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి చిన్న పని కోసం మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు ఇప్పుడు అన్ని రకాల సేవలు తమ గ్రామాల్లోకి పొందుతున్నట్లు మంత్రి తెలిపారు. రూ.300 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వాటర్ గ్రేడ్ ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి శుద్ధజలాన్ని అందించే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం తాగునీరు అందించడమే తమ ధ్యేయం అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్ట వెంకటేశ్వర రెడ్డి, డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణ మూర్తి, సింగిల్ విండో అధ్యక్షులు బాలయ్య బోరెడ్డి రాము, రంగస్వామి జెసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు గడ్డం భువనేశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, పోదొడ్డి కృష్ణమూర్తి, శ్యామ్ రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి,వెంకటేశ్వర్లు,సీమ సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నిజాముద్దీన్,శీను వాసులు, బషీర్,సోమశేఖర్, జయరామయ్య, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పి ఆర్ రోడ్డును ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

యధావిధిగా ఎడమ గట్టు విద్యుత్ ఉత్పత్తి

- క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

కృష్ణా పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం పూర్తిగా నిలిచి పోవడం వలన అలాగే తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి నీటిని వినియోగిస్తుండడంతో క్రమంగా జలాశయ నీటిమట్టం తగ్గుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుండి ఏమాత్రం నీటి ప్రవాహము రావడం లేదు.

అదే సమయానికి జలాశ నీటివ ఎట్టం 864.70 అడుగు లుగా.. నీటి నిల్వ సామ ర్థ్యం 121.2458 టీఎంసీలుగా నమోదు అయ్యి ంది. అదే సమయానికి యధావిధిగా తెలంగాణ ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 19,460 క్యూస్సెక్కుల నీటిని వినియోగిస్తూ గడచిన 24 గంటల్లో 10.283 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి కూడా మహాత్మా గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ కు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

ప్రజాశక్తి-డోన్

యోగా చేయడం వల్ల ప్రతి విద్యార్థిని ఒత్తిళ్లను జయించవచ్చు అని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కె.షాలినిప్రకాష్ తెలిపారు. శుక్రవారం డోన్ లోని మోడల్ స్కూల్ హాస్టల్లో చదువుకుంటున్న 100 మంది విద్యార్థినీలకు పది రోజుల పాటు యోగాలో శిక్షణ మెలుకువలను యోగా గురూజీ సోను ఆధ్వర్యంలో నేర్పించారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు కె.షాలినిప్రకాష్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల విద్యార్థులలో ఏకాగ్రత పెరుగుతుందని, అలాగే ఆరోగ్య సమస్యలను తొలగించుకోవచ్చు అని పేర్కొన్నారు. యోగ ప్రతి రోజు చేయడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు ముడియాల శైలజారెడ్డి ఆర్థిక సౌజన్యంతో యోగాలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన పదిమంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు.అలాగే యోగాలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులను అందజేశారు.మోడల్ స్కూల్ హాస్టల్ వార్డెన్ శైలజా ఇన్నర్ వీల్ క్లబ్ వారికీ పూర్తి సహకారం అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యార్థినిలకు బహుమతులను అందిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

చెడగొడుతున్న పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతాంగాన్ని ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా జిల్లాలోని రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, సిపిఎం మండల నాయకులు ఎన్ స్వాములు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తపల్లి మండలంలోని లింగాపురం, గోకవరం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను, చెడగొడుతున్న రైతుల పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గత కొన్ని రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల కారణంగా ఆదిలోనే రైతన్నలకు కష్టాలు ఎదురయ్యాయన్నారు. ఈ ఏడాది ఆలస్యంగా వర్షాలు కురిసినప్పటికీ రైతులు తమ పొలాల్లో మొక్కజొన్న, పత్తి, వరి తదితర పంటలు సాగు చేశారని, ఇటీవల ఎడతెరిపిలేని భారీ వర్షాలకు పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. జిల్లావ్యాప్తంగా నష్టపోయిన పంటలను పరిశీలించకపోవడం జిల్లా వ్యవసాయ అధికారులకు ఆదేశాలు రాకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కనీసం పంటల వైపు కన్నెత్తి చూడడం లేదని అన్నారు. ప్రజా ప్రతినిధులకు రైతుల గోడు పట్టడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు సచివాలయ అధికారులు గ్రామాల్లో నష్టపోయిన పంటలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ క్రాప్ ఇన్సూరెన్స్ వర్తింపజేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి దాసు, జేమ్స్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి 75 మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి గ్రామానికి 75 మొక్కలు పంపిణీ చేసినట్లు డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, బి. వెంకటేశ్వర రావు తెలిపారు. శుక్రవారం 'అజాదీ కా అమృత్ మహోత్సవం'లో భాగంగా 'వసుధ వందన్' కార్యక్రమాన్ని నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిం చారు. అందులో భాగంగా అటవీ శాఖా అధికారులు విద్యార్థులతో కలిసి పాఠశాలలో మొక్కలు నాటారు. డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ బి. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరములు పూర్తి అయిన సందర్భముగా ప్రతి గ్రామానికి 75 మొక్కల చొప్పున అటవీశాఖ సామాజిక వనవిభాగం పర్యావరణ పరిరక్షణ కొరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో అటవీ క్షేత్రాధికారి డి.ఎన్.కె.ప్రసాద్, సెక్షన్ ఆఫీసర్లు సి.విజయభాస్కర్ రెడ్డి, జి.కిరణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు మేరి మార్గరెట్ అధ్యాపకులు కె.వి.ప్రసాద రావు , విద్యార్థులు హాజరై ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ నిర్వహించారు.

చాబోలు గ్రామస్తులకు పునరావాసం కల్పించాలి : సిపిఎం

- ఎంపి, ఎమ్మెల్యేలకు వినతి

ప్రజాశక్తి-నందికొట్కూరు టౌన్

జూపాడుబంగ్లా, శ్రీశైలం ప్రాజెక్టుల కోసం సర్వస్వం కోల్పోయిన చాబోలు గ్రామస్తులకు వెంటనే పునరావాసం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం పోతిరెడ్డిపాడు నీటి విడుదల కార్యక్రమానికి వచ్చిన ఎంపీ పోచ బ్రహ్మ నంద రెడ్డి, శాసనసభ్యులు తోగుర్ ఆర్థర్, శిల్పా చక్రపాణి రెడ్డిలను సిపిఎం నాయకులు పి,పకీర్ సాహెబ్, ఎం కర్ణ, రాము, చాబోలు గ్రామస్తులతో కలిసి పోతిరెడ్డిపాడు గేటు ముందు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరావు, సిపిఎం నాయకులు పిపకీరు సాహెబ్, ఎం కర్ణ మాట్లాడుతూ చాబోలు గ్రామంలో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు విస్తరణ నందు జరిగిన పనుల వలన వారి మునకపొలాలు అందుబాటులో లేక జీవన భృతి లేక, నిత్యం దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆకస్మికంగా వచ్చే వరదల సమయంలో చాబోలు గ్రామం ప్రాజెక్టుకు అతి సమీపంలో ఉండడం వలన మునిగిపోయే అవకాశం అధికంగా ఉందని, చాబోలు గ్రామంలో సుమారు 100 కుటుంబాలకు జూపాడుబంగ్లా గ్రామం నందు పునరావాసం కింద ఇల్లు, స్థలాలు మంజూరు చేయాలని అనేక రూపాల్లో ఆందోళన చేసి కలెక్టర్, ఆర్డిఓ, తహశీల్దార్‌ల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి చాబోలు గ్రామస్తులకు జూపాడు బంగ్లా గ్రామంలో పునరావాసం కింద స్థలాలు ఇచ్చి, పక్క గృహాలు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు రిలే దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. రెండో విడత 98 జీవో 674 మంది నీటి ముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని 107 రోజులు వివిధ రూపాల్లో ఆందోళనలు, దీక్షలు చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగాలు అప్పుడు ఇప్పుడు అంటూ మాయమాటలు చెబుతున్నారె తప్ప ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగాలు ఇవ్వాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న శ్రీశైలం నీటి ముంపు నిర్వాసితులపై, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టడం జరిగిందన్నారు. వెంటనే స్పందించి రెండో విడత శ్రీశైలం నీటి ముంపు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, లేని పక్షంలో నీటి ముప్పు నిరుద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు శివ, గ్రామస్తులు పెద్ద నాగన్న, చిన్న నాగన్న, పుల్లయ్య, సుధాకర్, నాగేంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

టిడిపి సెల్ఫీ ఛాలెంజ్

సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సంత జూటూరు నుండి లింగాపురం రోడ్డును, ఆర్.బి.కె గోడౌన్, నారాయణ పురం జిసి పాలెం మధ్య పెద్దవాగుపై వంతెన నిర్మిం చకపోవడం, చెంచుల గృహాలను నిర్మించలేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు అవుతున్న రోడ్లు మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైసిపి విఫలమైందని అన్నారు. తెలుగుదేశం పార్టీ మండల ఇంచార్జ్ నందిపాటి నరసింహారెడ్డి, జెసి పాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు కం చర్ల చిన్న లింగారెడ్డి, తెలుగు యువత శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు మల్లే శ్వర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డోన్ : పట్టణంలోని రైల్వే గేట్ల మధ్య అండర్ పాస్ నిర్మిస్తున్నట్లు ఉత్తుత్తి శిలాఫలకాలు వేసి మంత్రి బుగ్గన ప్రజలను మోసం చేస్తున్నాడని టిడిపి డోన్ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు పట్టణంలోని కర్నూలు రైల్వే గేట్ల సమీపంలో శిలాఫలకం వద్ద సెల్ఫీ చాలెంజ్ విసిరారు. రైల్వే శాఖ నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాకున్నా రూ. 6 కోట్లు నిధులు మంజూరైనట్లు మంత్రి బుగ్గన ప్రజలను చీటింగ్ చేస్తున్నాడని సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇంకెంతకాలం మోసం చేస్తారని మండిపడ్డారు. ఉత్తుత్తి శిలాఫలకంపై మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

శిలాఫలకం వద్ద సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

ఎంఇఓ కార్యాలయంలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - గడివేముల

గడివేముల మండల విద్యాధికారి కార్యాలయంలో నిధుల వివరాలు, ఇతర రికార్డులను ఆర్‌టిఐ కింద శుక్రవారం పరిశీలన చేసినట్లు దరఖాస్తుదారుడు బహుజన టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక జిల్లా అధ్యక్షులు కె. సతీష్ కుమార్ తెలిపారు. కె. సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎంఇఓ కార్యాలయంలో మంజూరైన నిధులలో అనేక తప్పుడు బిల్లులు పెట్టినట్లు తెలుస్తోందని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

తుమ్మలూరులో రీ సర్వే పూర్తి

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని తుమ్మలూరు గ్రామంలో చేపట్టిన రీ సర్వే పూర్తయినట్లు తహశీల్దార్ రత్న రాధిక తెలిపారు. శుక్రవారం నాడు గ్రామంలో రీ సర్వేపై సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో గత 30 రోజుల నుండి చేపట్టిన సర్వే 10 తేది ఆగస్టు నెలకు పూర్తి అయ్యిందని, ఈమేరకు శుక్రవారం నాడు గ్రామసభ నిర్వహించి భూ హక్కు రికార్డుల ముసాయిదాను గజిట్ ఫారం- 13ను ప్రచురించామన్నారు. సర్వే డిప్యూటీ తాసిల్దార్ పటాన్ బాబు, సర్పంచ్ వరప్రసాదరావు, సర్వే సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూతురుపై అత్యాచారానికి పాల్పడ్డ తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - బనగానపల్లె

జైలు శిక్ష పడిన వెంకటేశ్వర్లు

కూతురిపై అత్యాచారానికి పాల్పడ్డ తండ్రికి 20 సంవత్సరాల జైలు శిక్ష పడిందని నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ జిల్లెల్ల గ్రామానికి చెందిన పెరుమాళ్ల వెంకటేశ్వర్లు (అలియాస్ సునీల్) మైనర్ బాలిక అయిన తన కూతురిపై 2019 నవంబర్ 12వ తేదీన తండ్రి పెరుమళ్ళ వెంకటేశ్వర్లు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపారు. నవంబర్ 29వ తేదీన బాలిక తన తల్లితో కలిసి వచ్చి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అత్యాచారం చేసినట్లు కేసు రుజువు కావడంతో కర్నూలు జిల్లా సెషన్ కోర్టు న్యాయమూర్తి భూపాల్ రెడ్డి నిందితుడు పెరుమాళ్ల వెంకటేశ్వర్లుకు 20 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుకు మహిళ మృతి

ప్రజాశక్తి - పాణ్యం

పాముకాటుతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని భూపనపాడు గ్రామంలో చోటు చేసుకుంది. భూపనపాడు గ్రామానికి చెందిన సరోజ (50) గత నెల క్రితం తమ పొలంలో పనులు చేసుకుంటూ ఉండగా పాముకాటుకు గురై కర్నూలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతుండగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులో ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నారు. అక్కడి నుండి నాలుగు రోజుల కిందట చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరాంహాస్పిటల్‌లో చేరారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. మృతురాలికి కొడుకు, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి : ప్యాప్టో

ప్రజాశక్తి-డోన్

నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ప్యాప్టో ఆధ్వర్యంలో శనివారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని డోన్ తాలూకా ప్యాప్టో నాయకులు ఎం.వెంకటసుబ్బారెడ్డి,ఇక్బాల్,లక్ష్మయ్యలు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 117 జీవో రద్దు, ప్రమోషన్‌లు, బదిలీలు, సిపిఎస్ రద్దు, తదితర సమస్యలపై నిర్వహించ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవిశేఖర్,అల్లిపీరా,రమేష్, రఘునాథ్,సురేష్,వెంకటలక్ష్మీ,ఎస్తేరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్యాప్టో నేతలు

వేంపెంట సింగిల్ విండో సొసైటీ చైర్మన్‌గా మచ్చ పెద్ద వెంకటస్వామి

ప్రజాశక్తి - పాములపాడు

వేంపేట సింగిల్ విండో చైర్మన్‌గా పాముల పాడు గ్రామానికి చెందిన మచ్చ పెద్ద వెంకటస్వామి ఎన్నికయ్యాడు. ఈ మేరకు సంబంధిత శాఖ ద్వారా శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పాములపాడు మండల వైసీపీ నాయకులు , టిఎన్ఆర్ కంపెనీ యజమాని టీ నాగరాజు తండ్రి పెద్ద వెంకటస్వామికి చైర్మన్ రావడం పట్ల పలువురు నాయకులు మండలం లోని రైతులు హర్షం వ్యక్తపరిచారు. పెద్ద వెంకటస్వామి, నాగరాజు మాట్లాడుతూ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆశీస్సులతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సొసైటీ చైర్మన్‌గా మా కుటుంబానికి ఇవ్వడం మాకెంతో ఆనందంగా ఉందని, వారికి కృతజ్ఞులై ఉంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మహానంది

నల్లమల్ల ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నంద్యాల నుండి గిద్దలూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తున్న మినీ లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలానికి చెందిన ఆనందరావు (24)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు ఆనందరావు ఆయ్యాలూరు మెట్టలోని నవజీవనజ్యోతి పాఠశాలలో స్పెషల్ డిఇడి రెండవ సంత్సర ప్రాక్టికల్ పరీక్షలు రాసి స్వస్థలం వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటన స్థలానికి మహానంది పోలీస్ సిబ్బంది చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్టర్ చెన్నకేశవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం బనగానపల్లె సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె సబ్ రిజిస్టర్ శ్రీధర్ గుప్తా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్ ఆఫీస్ లో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా రిజిస్టర్ చెన్నకేశవరెడ్డి

కార్మికులకు వేతనాలు వెంటనే ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

గ్రామాల్లో చెత్తాచెదారాన్ని సేకరించి ఊరి చివర వేసి గ్రామాల పరిశుభ్రతకు ప్రజలకు అంటురోగాలు రాకుండా చూస్తూ నిత్యం సేవలు చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం, సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు నాలుగు నుంచి 18 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి చుట్టూ అనేకసార్లు తిరిగిన వేతనాలు అప్పుడు ఇప్పుడు ఇస్తామని చెప్తున్నారె తప్ప నేటికీ వారి అకౌంట్లో వేతనాలు పడలేదని, పెండింగ్ వేతనాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఒకపక్క రోజురోజుకు ధరలు పెరిగి నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ ఉంటే ఇచ్చే అతి తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ స్వచ్ఛభారత్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం

కార్మికులు నిత్యం పని చేస్తున్నారన్నారు. పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సర్పంచుల చుట్టూ జిల్లా అధికారుల చుట్టూ తిరిగిన ఏమాత్రం ఫలితం లేదన్నారు. వేతనాలు ఇవ్వమని అధికారులను అడుగుతే మీరు పనులు చాలించుకోండి వేరేవాళ్లను పెట్టుకుంటామని నేటికి బెదిరింపులు చేస్తున్నారని,కొన్నిచోట్ల గ్రామ సర్పంచులు మా గ్రాంటు నుండి మీకు వేతనాలు ఇవ్వము మీరు పనులు చాలించుకోండి అని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం రూ.10వేలు జీతం ఇస్తామంటూ జీవో నెంబర్ 680 వచ్చినా నేటికీ అమలు కావడం లేదన్నారు. స్వచ్ఛభారత్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అక్రమ వేధింపులు తొలగింపులు ఆపాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాలలో చెత్త బండ్లు చెడిపోతే వాటి రిపేర్లు ఖర్చులు కూడా ఇవ్వడం లేదని స్వచ్ఛభారత్ కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫాం, గ్లౌజులు, మాస్కులు, రెండు జతల చెప్పులు ఇవ్వాలి ప్రభుత్వం వెంటనే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. జిల్లా కలెక్టర్, డిపిఓ ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే వారి పెండింగ్ వేతనాలు ఇవ్వాలని వారు కోరారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ. 3.43 కోట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు భక్తులు చెల్లించుకున్న కానుకలను ఇఒ లవన్న అధ్వర్యంలో శుక్రవారం నాడు లెక్కించారు. గడిచిన 28 రోజులలో భక్తులు హుండీలలో చెల్లించుకున్న కానుకలలో నగదు రూ.3,43,68, 091లు లభించాయి. వీటితో పాటు బంగారం 170 గ్రాముల 400 మిల్లిగ్రాములు, వెండి 10కేజీల300 గ్రాములు లభించాయి. 940 యుఎస్ఏ డాలర్లు, ఆస్ట్రేలియా డాలర్లు 150, మలేషియా రింగ్స్ 4, కెనడా డాలర్లు 70, యుకె పౌండ్స్ 80, మొదలైన విదేశీ కరెన్సీలు హుండీలో లభించాయి. ఈ హుండీ లెక్కింపు పటిష్టమైన భద్రత సీసీ మెగా కెమెరాల మధ్య లెక్కింపు జరిగింది. ఇందులో దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళములు

శ్రీశైలం దేవస్థాన అన్నదాన పథకానికి ఒంగోలుకు చెందిన ఎం హనుమంతరావు రూ. 1,01,116 కుటుంబ సమేతంగా దర్శించుకుని సహాయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాస రెడ్డికి అందజేశారు. దాతలకు సహాయ కార్య నిర్వహణ అధికారి ప్రసాదాలను సంబంధించిన ధ్రువపత్రాలను అందజేశారు.

శ్రీశైలంలో సామూహిక వరలక్ష్మీ వ్రతములు

శ్రావణమాసం పురస్కరించుకొని శ్రీశైలం దేవస్థానం వారు సామూహిక వరలక్ష్మీ వ్రతంలో నిర్వహిస్తున్నట్లుగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. ఈ వ్రతంలో పాల్గొన్న లేని

హుండి లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఇఒ లవన్న

మహిళలు రూ.1116/లు దేవస్థానం వెబ్ సైట్ ద్వారా చెల్లించి పరోక్ష సేవ నిర్వహించుకోవచ్చు అని తెలిపారు.

ప్రతి ఓటును వెరిఫై చేయాలి : బిసి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ జాబితాలో పేర్లను పరిశీలించాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, నియోజకవర్గం పరిశీలకులు బాజీ చౌదరిల ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 5 మండలాల క్లస్టరు, యూనిట్ ఇంచార్జీలకు ఓటర్ వెరైఫికేషన్,మహాశక్తి, భవిష్యత్తు గ్యారెంటీ ప్రోగ్రామ్ గురించి రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు వాలంటరీల ద్వారా దొంగ ఓట్లను ఎక్కించేందుకు ,టిడిపికి అనుకూలమైన ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఓటరు జాబితాను తీసుకొని ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లను పరిశీలించాలన్నారు. ఓటర్ జాబితాలో తప్పులను నిత్యం పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు బాజీ చౌదరి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను, భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రతి ఇంటికి చేరే విధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, టిడిపి నాయకులు నంద్యాల రామేశ్వర రెడ్డి, మూలే రామేశ్వర రెడ్డి, మంగంపేట శ్రీనివాసులు వేములపాడు గుర్రప్ప, క్లస్టరు, యూనిట్ ఇంచార్జీ లు పాల్గొన్నారు.

ఆత్మకూర్ : మహిళల భవిష్యత్తుకు సంక్షేమ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు గ్యారెంటీ అని తెలుగుదేశం పార్టీ మహిళా సంఘం నాయకురాలు గంగాదేవి అన్నారు. శుక్రవారం సాయంత్రం మహాశక్తి ప్రచార కార్యక్రమం లో భాగంగా సిద్దేపల్లి గ్రామంలో మహిళా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు భరోసా కల్పించడంలో వారికి అన్ని విధాల ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ముందుండి పనిచేస్తుందని ఆమె అన్నారు. మహిళా నాయకుల సరోజి, నాయకులు పాల్గొన్నారు.

వైసిపికి పరాభవం తప్పదు : గౌరు చరిత

పాణ్యం: రాబోయో ఎన్నికల్లో వైసిపికి పరాభావం తప్పదని నియోజక వర్గ ఇంఛార్జి గౌరు చరిత అన్నారు. శుక్రవారం మండలంలోని తమ్మరాజు పల్లె గ్రామంలో గౌరు చరిత నారీ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపితో అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు లాయర్ బాబు, రమణ మూర్తి,జయ రామిరెడ్డి,రామ పుల్లారెడ్డి, రంగ రమేష్, ఇప్ప సుధాకర్,ఖాదర్ ఖాజా,దుబాయ్ శీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గౌరు చరిత

సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంట్ల 25 మరియు 1 వ వార్డు పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గంగుల ఇంటింటికి వెళ్లి వారి దగ్గిర సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, విద్యుత్ ఏఈ కంబగిరి, చింతకుంట్ల శివనాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకురాలు శంషాద్ బి, ముబారక్ లు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎంపిడిఓ కార్యాలయం దగ్గర మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండల అభివృద్ధి అధికారి, మండల విద్యాశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుండి మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ప్రతి నెల 5వ తేదీ లోపు చెల్లించాలన్నారు. నిత్యవసర ధరల పెరుగుదలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపా యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అహమ్మద్ బి, బిచ్చమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి, హుస్సేన్ బి, రమీజా బి, పుల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

13న జిల్లా స్థాయి యోగ పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని టీబి రోడ్‌లో ఉన్న ఆవుల పుల్లారెడ్డి యోగా హాల్ నందు ఈనెల 13న ఆదివారం నంద్యాల రెండవ జిల్లా స్థాయి యోగ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ ఆవుల విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాలు అలాగే 45 సంవత్సరాలు పై బడిన వయస్సు వారికి, బాల బాలికల, స్త్రీ, పురుషుల విభాగంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను సెప్టెంబర్ రెండో వారం కర్నూలు జిల్లాలో జరగబోయే 48వ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు నంద్యాల జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జిల్లా స్థాయి యోగ పోటీలకు వచ్చేవారు డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ లేదా బోనఫైడ్ సర్టిఫికెట్ తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9866136324, 9440826259 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాలకృష్ణ, కార్యదర్శి హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న జడ్పిటిసి శ్రీరామ రెడ్డి

ప్రజాశక్తి - ప్యాపిలి

మండల సర్వసభ్య సమావేశం పంచాయతీ ఎన్నికల కోడ్ దృష్టిలో ఉంచుకొని మొక్కుబడిగా సమావేశం సాగింది. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశమున్నా తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉప ఎంపీపీ రాజా రూపా రాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు జడ్పిటిసి బోరెడ్డి శ్రీ రామ్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 20 మంది ఎంపీటీసీ లకు గాను 7 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు ఎవరూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దష్టికి తీసుకురాలేదు. దీంతో సమావేశం గంటన్నరలో ముగిసింది. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, డాక్టర్లు, పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సహకార సొసైటీ సంఘాల చైర్మన్‌లు ఖరారు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని సహకార సొసైటీ సంఘాల చైర్మన్‌లుగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఖరారు చేసింది.

బ్రాహ్మణకొట్కూరు సొసైటీ చైర్మన్‌గా ఎం సతీష్ కుమార్ రెడ్డి, పిరు సాహెబ్ పేట సొసైటీ చైర్మన్‌గా తమ్మిదల నాగ తులసి రెడ్డి, పగిడ్యాల సొసైటీ చైర్మన్ ఎస్ రామచంద్ర రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్‌గా గౌరు జనార్దన్ రెడ్డి, 80 బన్నూరు సొసైటీ చైర్మన్ వై.వి వెంకటరమణ, నందికొట్కూరు సొసైటీ చైర్మన్ జి. లక్ష్మీకాంతరెడ్డి, వేంపేంట సొసైటీ చైర్మన్ మచ్చ పెద్ద వెంకటస్వామి, మద్దూరు సొసైటీ చైర్మన్‌గా గడ్డం కృష్ణారెడ్డి ఎన్నిక కావడం జరిగింది. నూతనంగా ఎన్నికైన చైర్మన్ లకు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అభిమానులు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపీ గోరంట్ల మాధవ్‌కు కురువ సంఘం సన్మానం

ప్రజాశక్తి - గడివేముల : హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను శుక్రవారం నాడు శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల నందు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన కురువ సంఘం నేతలు నాయకులు పూలమాల, శాలువాలతో శుక్రవారం సత్కరించారు. ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడ తూ మా నివాసంలో జరిగే నా కూతురు వివాహానికి మండలంలోని కురవ సంఘానికి చెందిన ప్రతి ఒక్కరు రావాలని ఈ సమావేశంలో తెలిపారు. రాబోయే రోజుల్లో ఏమైనా కురువల సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పెద్దలు పాపారాయుడు, పాపయ్య, పెద్ద రంగడు, గని హర్ష కుమార్, ప్రసాద్, రామకృష్ణ, రామస్వామి, శ్రీనివాసులు, ఓబులేసు, నాగ శేషులు, పెద్దన్న, రమణయ్య, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఎంపీ గోరంట్ల మాధవను సత్కరిస్తున్న కురువ సంఘం నేతలు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - బేతంచర్ల

విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు క్రీడలు అవసరం అని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగరాజు అన్నారు. శుక్రవారం స్థానిక మోడల్ స్కూల్లో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీలను ప్రిన్సిపల్ గంగుల నాగరాజు వైస్ ప్రిన్సిపల్ కౌసర్జహాన్ ప్రారంభించారు. కబడ్డీ, పరుగు పందెం,క్రికెట్ మ్యూజికల్ చైర్స్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ గంగుల నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్ తెలియజేశారు.

15న జిల్లా చెస్ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా చెస్ సంఘం నిర్వహణలో ఈ నెల 15వ తేదీన నెరవాటి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో అండర్ - 13 జిల్లా చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియే షన్ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ శుక్రవారం తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9010451585 ద్వారా సంప్రదించాలని తెలిపారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి : ఎఇ

ప్రజాశక్తి - మహానంది

రైతులు పంట పొలాల్లో రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడటం వలన పెట్టుబడి తగ్గి అధిక దిగుబడి, అధిక లాభాలు పెరుగుతాయని మహానంది మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బొల్లవరం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని రైతులతో నిర్వహించారు. పంట పొలాలను పరిశీలించి అక్కడే రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ, గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం : ఎడిఎ

ప్రజాశక్తి - పాములపాడు

చిరుధాన్యాలతో ఆరోగ్యవంతంగా ఉంటారని ఆత్మకూరు ఏడిఏ ఆంజనేయ అన్నారు. శుక్రవారం నాడు జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భం గా పాములపాడు లోని జడ్పీ హైస్కూల్ నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడారు. శరీరానికి కావలసిన పదార్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పనిశ్వర్ రెడ్డి, పశువైద్యాధికారి భాస్కరు, ఏఈఓ మద్దిలేటి, ప్రధానోపాధ్యా యురాలు వెంకట సుబ్బమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాగంటిలో సిసి రోడ్లకు భూమిపూజ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని ప్రముఖ శైవచేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో సిసి రోడ్ల నిర్మాణానికి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డిలు భూమి పూజ నిర్వహించారు. శుక్రవారం యాగంటి దేవస్థానంలో యాగంటి కోటి రూపాయలతో డీఎంఎఫ్ నిధులతో వేస్తున్న సిసి రోడ్లకు ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డిలు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో దేవస్థానంలో సిసి రోడ్లను వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు చిన్ని స్వామి, రాఘవేంద్ర స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు ఎస్ఐగా వెంకటప్రసాద్ బాధ్యతలు

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వెంకట ప్రసాద్ గురువారం పదవి బాధ్యతలను చేపట్టారు. అనంతపురం నుండి ఇక్కడికి బదిలీపై వచ్చారని నూతన ఎస్ఐ తెలిపారు.

బాల్య వివాహాలతో ప్రమాదం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల జీవితానికి ప్రమాదం వాటిల్లుతుందని, వాటి నివారణకు అందరం కృషి చేయాలని ఐసిడిఎస్ నందికొట్కూరు ఏసి డిపిఓ మంగావల్లి, ఎంపీడీవో మేరీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు ఐసిడిఎస్ సూపర్వైజర్లు నాగేశ్వరమ్మ, అంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడడం అందరి బాధ్యత అన్నారు.బాల్య వివాహాలు నిర్వహిస్తే 112,181,100, టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు హరితమ్మ, రవణమ్మ, మరియమ్మ, శేసమ్మ, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం సేవ చేసిన వారిని స్మరించుకోవాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

దేశం కోసం సేవ చేసిన వారిని స్మరించుకోవాలి అనిమున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయం పరిధిలోని జై కిసాన్ పార్కు నందు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ పి.కిషోర్‌ల ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరి మాతి మేరా దేశ్ మాతి కో నామం - వీరోన్ కా వందన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మన దేశ మాజీ సైనికులను ఉద్దేశించి దేశం కోసం చేసిన వారి సేవలను ఉద్దేశించి పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడారు. అనంతరం మాజీ సైనికులను సన్మానించి, జై కిసాన్ పార్కు నందు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో రాజశేఖర్ బాబు, ఎంఇఓ ఫైజున్నిసా బేగం, మున్సిపల్ మేనేజర్ మంజునాథ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు అబ్దుల్ హమీద్ మియ్యా, పి.చాంద్ బాష, అబ్దుల్ రవూఫ్, లాలు ప్రసాద్, చెరుకు సురేష్ వైసిపి నాయకులు సప్లయర్ సత్యనారాయణ, రజిని కుమార్ రెడ్డి, డి.రమేష్, శాలి బాష, పి.రమేష్, బ్రహ్మయ్య ఆచారి, వి.ఆర్ శ్రీను, బోయ శేఖర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని మసీదుపురం, సీతారాంపురం, గాజులపల్లే, ఆర్ఎస్ గాజుల పల్లి, తమ్మడ పల్లి గ్రామాలలో నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఎల్‌డిఇ అధికారి జనార్ధన్ రావు పాల్గొని మాట్లాడారు. దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్థానిక మహనీయులను, సాహసవంతులను, వీరులను స్మరించుకోవాలని అన్నారు. అనంతరం శిలాఫలకాల చుట్టూ మట్టి దీపాలను వెలిగించారు. ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న తమ్మడ పల్లి వాస్తవ్యులు వెంకటేశ్వర్లు, కరిముల్ల, నాగముని వారి కుటుంసభ్యులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమాలలో ఎంపిడివో శ్రీమతి పి.శివ నాగ జ్యోతి, పంచాయతీ ఏ. ఈ. రాముడు, ఏపీవో మనోహర్, ఈసీ రామేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వెంకటయ్య, ఇర్ఫాన్, భాస్కర్, మసీదుపురం సర్పంచ్ కాకనురు లక్ష్మిరెడ్డి, ఎంపిటిసి మునగాల మల్లికార్జునరెడ్డి, సీతారాంపురం బుడ్డారెడ్డి ప్రభాకర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, గాజులపల్లి సర్పంచ్ గడ్డం చంటి, ఎంపిటిసి చౌటుపల్లి నరసిం హులు, కో ఆప్షన్ మెంబర్ మంటినునే సుభాన్, తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** మండల పరిధిలోని గొరుమానుకొండ తండా దగ్గర నా 'భూమి-నా దేశం'ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు, ఏపీవో శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వెంగన్న, గోరుమాను కొండ సర్పంచ్ కోడే వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహానంది : జవాన్ల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్నాను విజయవంతం చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదీ జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి. మాధవ స్వామి కోరారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బి. మాధవస్వామి మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలను నిర్వీర్యం చేసే 117 జీవో రద్దు చేయాలని, ప్రిన్సిపల్ సెక్రటరీ వైఖరి మారాలని, పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 010 క్రింద జీతాలు చెల్లించాలని చేస్తున్న ధర్నాను విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయులు యాగంటప్ప, ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు .

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మెస్ చార్జీల పెంపునకు పోరాటం: ఎఐటియుసి

ప్రజాశక్తి - కొలిమిగండ్ల

జగనన్న గోరుముద్ద కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ప్రత్యక్ష పోరాటం నిర్వహిస్తామని ఏఐటీయూసీ కొలిమిగుండ్ల ఏఐటీయూసీ కార్యదర్శి రామక్రిష్ణ అన్నారు. శుక్రవారం మండలం లోని గ్రామాల్లో పర్యటించి మధ్యాహ్న భోజన పథకం లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే విద్యార్థి మెస్ ఛార్జీలు, కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

షైన్ నూతన ఆసుపత్రి ప్రారంభం

పజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలో ఊపిరితిత్తుల నిపుణులు డాక్టర్ ఫ్రాంక్ మోహన్, అత్యవసర చికిత్స నిపుణురాలు డాక్టర్ కిరణ్మయి, ఇంటెన్సివ్ కేర్ వైద్యులు డాక్టర్ దిలీప్ కలిసి నూతనంగా ఏర్పాటు చేసిన షైన్ ఛాతి, అత్యవసర చికిత్స ఆసుపత్రిని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఆసుపత్రిలోని ఐసియూ, జనరల్ వార్డు, ఎక్స్ రే విభాగం, లేబరేటరీ, ఓపిడి విభాగాలను ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా, కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, కోశాధికారి డాక్టర్ పనిల్, రాష్ట్ర ఐఎంఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఐఎంఏ కార్యవర్గ కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ఫ్రాంక్ మోహన్, డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ఊపిరితిత్తుల ప్రత్యేక చికిత్స విభాగం, దానితోపాటు అన్ని రకాల అత్యవసర చికిత్సల విభాగాలతో వెంటిలేటర్లు, మానిటర్లు, ఏర్పాటు చేసి ఆసుపత్రి నెలకొల్పామని దీని ద్వారా 24 గంటలు అత్యవసర వైద్య సదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లా డుతూ నంద్యాల ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల వైద్యులు డాక్టర్ రాజశేఖర్,డాక్టర్ వసుధ, డాక్టర్ నర్మదా, డాక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఐ ఎం ఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి రవికృష్ణ, చిత్రంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ ఫ్రాంక్ మోహన్, డాక్టర్ కిరణ్మయి తదితరులు